సాక్షి
మంచిర్యాల
సోమవారం । 21 । అక్టోబర్ । 2024

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /24.2

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని చాలాచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.



వీరులారా.. వందనం

- వివరాలు 8లో▸

కర్తవ్య దీక్షలో భాగంగా శత్రువులతో పోరాడి అమరులైన పోలీసుల సంస్మరణ దినం అక్టోబర్ 21న జరుపుకుంటున్నాం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ సందర్భాల్లో పలువురు పోలీసులు ప్రాణత్యాగం చేశారు. నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఉమ్మడి జిల్లా పోలీసు అమరులపై ప్రత్యేక కథనం. .

న్యూస్‌రీల్

జిల్లాలో 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. 12 మండలాల్లో 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం వరితోపాటు కొన్ని పంటలకు మేలు చేయగా, మరికొన్ని చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. జైపూర్, హాజీపూర్ మండలాల్లో పొట్ట, గొలుసు దశలో ఉన్న వరి పంట నేలవాలింది. మండలాల వారీగా చూస్తే.. భీమారంలో 25.2 మిల్లీమీటర్లు, నస్పూర్ 15.8, జైపూర్ 15.3, లక్సెట్టిపేట 12, బెల్లంపల్లి 12.1, హాజీపూర్ 11.8, మంచిర్యాల 11.6, చెన్నూర్ 11.2, కాసిపేట 6.5, జన్నారం 3.8, తాండూర్ 2.2, మందమర్రి 0.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు చింతపల్లి విద్యార్థిని


ఎంపికైన రక్షిత

దండేపల్లి: నస్పూర్‌లో ఆదివారం జరిగిన అండర్-17 జోనల్ స్థాయి కరాటే పోటీల్లో దండేపల్లి మండలం చింతపల్లికి చెందిన గొర్ల రిక్షిత ప్రతిభ కనబర్చింది. ఆమెను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఐటీఐలో అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో అడ్మిషన్లు

మంచిర్యాలఅర్బన్: మందమర్రి ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కోర్సుల(ఏటీసీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ కన్వీనర్ రమేశ్ తెలిపారు. మందమర్రితోపాటు రామగుండంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏటీసీలో ఆరు కొత్త కోర్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయా కోర్సుల్లో ఏడో దఫా అడ్మిషన్లు ఈనెల 30 వరకు జరుగుతాయని తెలిపారు.

డీఏ బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న చక్రపాణి

బెల్లంపల్లి: పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజు వేణు డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. డీఏ బకాయిలను విడుదల చేయకుండా, పీఆర్సీ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. గురుకుల, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కోరారు. గురుకులాల సమయపాలనలో మార్పులు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా బాధ్యులు కిరణ్, చంద్రమౌళి, దేవదాస్, రవికుమార్, సంతోష్, సంపత్, సతీశ్, బబిత, సంరక్ష పాల్గొన్నారు.

పవర్ ప్లాంటులో స్థానిక యువతకు ఉపాధి


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు విస్తరణలో భాగంగా కొత్తగా నిర్మించే మూడో యూనిట్ ప్లాంటులో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం, కేంద్ర మాజీ మంత్రి కాకా(గడ్డం వెంకటస్వామి) విగ్రహాల ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం పెగడపల్లి, గంగిపల్లి, ఎలకంటి, షెట్‌పల్లి, కుందారం గ్రామాల్లో రూ.1.27 కోట్ల తో నిర్మించే సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గ్రామాల్లో ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కరిస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మిస్తున్న ట్లు తెలిపారు. అనంతరం మండల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు ఎమ్మెల్యే వివేక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ డి ప్యూటీ డీఈ విద్యాసాగర్‌రావు, పీఏసీఎస్ వైస్ చై ర్మన్ సంతోషం చంద్రశేఖర్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఫయాజ్, విశ్వంభర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్యకు చెక్


అందాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో చెత్తను శుద్ధిచేసే ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్

- మంచిర్యాల మున్సిపాలిటీలో బయోమైనింగ్
- లక్ష మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి లక్ష్యం
- నాలుగు నెలల్లో పూర్తి చేసేలా పనులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో చెత్త డంపింగ్ పెద్ద సమస్యగా మారింది. అందాళమ్మ కాలనీలో కొన్నేళ్లుగా పట్టణంలోని చెత్తను డంప్ చేస్తున్నారు. ఇది ప్రస్తుతం గుట్టలుగా పేరుకుపోయింది. ఈ చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చెత్తను ఇక్కడి నుంచి తరలించాలని కోరుతున్నారు. పలుమార్లు చెత్త డంపింగ్ వాహనాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో బల్దియా అధికారులు డంప్ యార్డు కోసం పలు ప్రాంతాల్లో స్థలం పరిశీలించారు. వివిధ కారణాలతో ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈక్రమంలో చెత్త సమస్య పరిష్కారానికి అధికారులు బయోమైనింగ్‌కు శ్రీకారం చుట్టారు.

నిత్యం 40 మెట్రిక్ టన్నుల చెత్త..

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల నుంచి నిత్యం 40 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. అందాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో ప్రస్తుతం లక్ష మెట్రిక్ టన్నుల చెత్త నిల్వ ఉంది. ఈ చెత్త నుంచి దుర్వాసన, నిత్యం మంటలు అంటుకోవడం, పొగ కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందాళమ్మ కాలనీలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన సమయంలో సమీపంలో ఇళ్లు లేవు. పట్టణ పరిధి పెరుగుతుండడంతో అందాళమ్మ కాలనీలో నిర్మాణాలు పెరిగాయి. సమీపంలో గ్రీన్‌సిటీ, రంగంపేట్, పవర్‌సిటీ కాలనీలు వెలిశాయి. డంపింగ్ యార్డుకు ఇళ్లు నిర్మించారు. దీంతో డంపింగ్ యార్డును తరలించాలన్న డిమాండ్ పెరిగింది.

గతేడాదే బయోమైనింగ్..

చెత్త శుద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో ప్రభుత్వం బయోమైనింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మంచిర్యాల మున్సిపాలిటీలో మాత్రం వివిధ కారణాలతో జాప్యం జరిగింది. దీంతో అందాళమ్మ కాలనీలోని మూడెకరాల విస్తీర్ణంలో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. ఈ క్రమంలో ఎట్టకేలకు ఇటీవలే బల్దియాలో బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. వర్షాల కారణంగా పనులు కాస్త ఆలస్యమయ్యాయి. ఇప్పుడిప్పుడే పుంజుకున్నాయి. నాలుగు నెలల్లో లక్ష మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రక్రియలో చెత్తను శుద్ధిచేసి ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి, గాజు, రాళ్లు వేరు చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యుత్, సిమెంట్ ఉత్పత్తి కేంద్రాల్లో పునర్వినియోగానికి తరలిస్తారు. గాజు వంటి వ్యర్థాలను సంబంధిత కేంద్రాలకు చేరవేయనున్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న యంత్రంతో నిమిషానికి టన్ను చెత్త శుద్ధి చేస్తున్నారు. వేసవికి ముందే అందాళమ్మ కాలనీలోని చెత్తను పూర్తిగా తొలగించనున్నారు. తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మారుస్తారు. రాళ్లను గుంతలు పూడ్చేందుకు ఉపయోగిస్తారు. సేంద్రియ ఎరువును మున్సిపాలిటీ పరిధిలోని మొక్కలకు వినియోగిస్తారు.

నస్పూర్‌లో డంపింగ్ యార్డు..

ఇక నస్పూర్‌లోని సింగరేణి స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. ఈమేరకు స్థల సేకరణ చేపట్టారు. డంపింగ్ యార్డును అక్కడికి తరలిస్తే అందాళమ్మ కాలనీతోపాటు, గ్రీన్‌సిటీ, పవర్ సిటీ, రంగంపేట్ కాలనీ ప్రజలకు ఊరట లభిస్తుంది.

చెత్త లేకుండా చేస్తాం..



మంచిర్యాల మున్సిపాలిటీలోని అండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో లక్ష మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దీనిని లేకుండా చేయడమే లక్ష్యంగా బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టాం. చెత్తను కంపోస్టుగా మార్చడంతో డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చేస్తాం. ఈ ప్రాంతం మొత్తం శుభ్రంగా మారడంతో స్థానికుల ఇబ్బందులు తొలగిపోతాయి. నాలుగు నెలల్లోనే బయోమైనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

సీతక్క ఫోకస్

- ఎమ్మెల్సీ, 'స్థానిక' ఎన్నికల నేపథ్యంలో..
- ఉమ్మడి జిల్లా పర్యటనలపై దృష్టి
- ఇటీవల పీసీసీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వెల్లడి


జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

సాక్షి, ఆదిలాబాద్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా పర్యటనలపై దృష్టి సారించారు. ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతీ నియోజకవర్గంలో పర్యటించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానం ఓటమితో ఆమెలో నైరాశ్యం కనిపించింది. తర్వాత ఒకట్రెండు ముఖ్య కార్యక్రమాలకు మినహా ఉమ్మడి జిల్లాలో పర్యటనలను తగ్గించారు. దీంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించడానికి ఆమె అంత ఆసక్తి కనబర్చడం లేదన్న ప్రచారం పార్టీలో సాగింది.

నేనొస్తున్నా..

ఇటీవల హైదరాబాద్‌లో పీసీసీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షి సమక్షంలో ఈ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలోనే సీతక్క మాట్లాడుతూ.. ఇకపై ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తానని, నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మొత్తం పది నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టనున్నారని కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు.

షెడ్యూల్ బిజీ

ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఉమ్మడి జిల్లాలో పర్యటనలకు సంబంధించి ఆమె దృష్టి సారించినప్పటికీ షెడ్యూల్ బిజీ కారణంగా ఇప్పటికిప్పుడే ఆమె పర్యటనలు ఖరారు కాకపోవచ్చనే అభిప్రాయం పార్టీలో వ్యక్తం అవుతోంది. దీనికి కారణం లేకపోలేదు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటం, అధిష్టానం నార్త్ మహారాష్ట్రకు సీతక్కను ఇన్‌చార్జిగా నియమించడంతో ఈ ఎన్నికలు ముగిసే వరకు ఆమె అక్కడ పర్యటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఎన్నికలు ముగిసేంత వరకు మంత్రి షెడ్యూల్ బిజీగా ఉండే అవకాశాలు ఉన్నాయని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

నిధుల కేటాయింపు..

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తోంది. ఇటీవల నియోజకవర్గాలకు రూ.10కోట్ల చొప్పున సీఆర్ఆర్ ఫండ్స్ కేటాయించింది. కొన్ని నియోజకవర్గాలకు ఎస్‌డీఎఫ్ నిధులను కూడా కేటాయించారు. వీటి ద్వారా రోడ్లు, కల్వర్టులు, ఇతర నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ నిధుల కేటాయింపులో ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. దీనికి కారణం లేకపోలేదు. ప్రధానంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఖానాపూర్‌లో మినహాయిస్తే మిగతా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నిధులకు సంబంధించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ క్రెడిట్‌గా చెప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే మంత్రి సీతక్క ప్రత్యేకంగా దృష్టిసారించడంతోనే ఈ నిధులు కేటాయించినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు చెప్పుకొస్తున్నారు. మొత్తంగా వచ్చే ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక ఆ పనుల శంకుస్థాపనలకు ఆయా నియోజకవర్గాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క పర్యటిస్తేనే కాంగ్రెస్ నియోజ కవర్గ ఇన్‌చార్జీలు, నాయకులు అందులో పాల్గొనేందుకు ఆస్కారం ఉంటుంది. తద్వారా ఈ ని ధుల కేటాయింపులో తాము కీలకంగా వ్యవహరించామని చెప్పుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఒకే విత్తనం.. మూడు రకాలుగా..

- విచిత్రంగా వరి పంట..
- కొంత గొలుసు.. కొంత పొట్టకు.. మరికొంత ఎదుగుదల దశలో..
- వేల ఎకరాల్లో ఇదే తీరు..
- ఆందోళనలో రైతులు


నెన్నెలలో నాణ్యత లేని వరి పంటను చూపుతున్న రైతు గంగిశెట్టి నరేశ్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నాసిరకం విత్తనాలతో అన్నదాత ఏటా నష్టపోతూనే ఉన్నాడు. కొన్నేళ్లుగా నకిలీ పత్తి విత్తనాలు కొంపముంచుతుండగా, ఈ ఏడాది నాసిరకం వరి విత్తనాలు రైతులను నట్టేట ముంచాయి. ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేసిన ఓ కంపెనీకి చెందిన విత్తనాలు సాగుచేసిన రైతులు, ప్రస్తుతం పొలంలో విచిత్రంగా పంట రావడం చూసి ఆందోళన చెందుతున్నారు. ఒకే రకం విత్తనం మూడు రకాలుగా ఉండడంతో విత్తన డీలర్లకు ఫిర్యాదులు చేస్తున్నారు.

మూడు రకాలుగా..

ఈ ఖరీఫ్ నుంచే సన్న వడ్లకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలో చాలా మంది రైతులు సన్నాలు సాగుచేశారు. 70 శాతం మంది రైతులు ఓ కంపెనీకి చెందిన విత్తనాలు కొనుగోలు చేశారు. నారు పోసుకుని నాట్లు వేసే వరకూ పంట బాగానే ఉంది. ప్రస్తుతం పంట మొత్తం పొట్ట దశలో ఉండాలి. కానీ 60 నుంచి 70 రోజులకే 20 శాతం పొట్టకు వచ్చింది. ఒకే గొలుసు వేసి తక్కువ గింజలు ఉన్నాయి. గింజలు కూడా నాసిరకంగా ఉన్నాయి. 20 శాతం పొలం ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. 60 శాతం పొలం పిలుకలు వేయలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకే బ్యాగులోని విత్తనాలు ఇలా విచిత్రంగా పంట రావడం చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇలా అయితే పెట్టిన పెట్టుబడి కూడా రాదని పేర్కొంటున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ల వద్దకు వెళ్లి మొర పెట్టుకుంటున్నారు. విత్తన కంపెనీ యజమానులు, వ్యవసాయ అధికారులు పరిశీలించి తమకు పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. నెన్నెల మండలంలోని కొన్ని పంటలను కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయాధికారులు పరిశీలించి విత్తన లోపం కారణంగానే పంట ఇలా ఉందని పేర్కొన్నారు. దీంతో రైతులు తాము ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు పెట్టుబడి పెట్టామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి రావాల్సిన పంట 15 బస్తాలు కూడా వచ్చేలా లేదని పేర్కొంటున్నారు.

నాలుగెకరాలు.. నాలుగు రకాలుగా..



నాలుగు ఎకరాల్లో సన్నరకం వడ్లు సాగుచేసిన. ఒకేరకం విత్తనం నాలుగు ఎకరాల్లో నాలుగు రకాలుగా ఉంది. ఎకరాకు ఇప్పటికే రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన. ఎకరాకు 40 బస్తాలు రావాలి. ప్రస్తుతం పంట చూస్తే 20 బస్తాలు కూడా వచ్చేలా లేవు. విత్తన కంపెనీ నుంచి పరిహారం ఇప్పించాలి.

– కమలాకర్‌రెడ్డి, కుందారం, జైపూర్

సన్న, దొడ్డు వడ్లు కలిపి..



తిండి గింజల కోసమని ఎకరం పొలంలో సన్నవడ్లు పెట్టిన. రూ.1000 వెచ్చించి విత్తనాలు కొన్న. నారు పోసి, నాట్లు వేసిన. ప్రస్తుతం పంట కొంత గొలుసు వేసింది. కొంత ఎదుగుతుంది. కొంత పొట్టకు వచ్చింది. సన్న రకం, దొడ్డు రకం వడ్లు కలిపి విత్తనాలు అమ్ముతున్నరు. అందుకే ఇలా ఉంది.

– మసాడి నారాయణ, బోయపల్లి, తాండూర్

మా దృష్టికి రాలేదు..

జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట లు దిగుబడి దశకు వచ్చాయి. వరి పంట విత్తన లోపం ఉందన్న విష యం మా దృష్టికి రాలేదు. రైతులెవ రూ ఫిర్యాదు చేయలేదు. వరిపంట ఈసారి ఆశాజనకంగా ఉంది. కొన్ని చోట్ల కోతలు కూడా ప్రారంభమయ్యాయి.

– కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

గ్రామాల్లోనే క్రీడాకారులు ఎక్కువ

- ఏసీపీ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

వేమనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఎక్కువగా ఉన్నారని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. నీల్వాయి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో హెచ్ఎం గిరిధర్‌రెడ్డి, పీఈటీ దాసరి మల్లేశ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఖోఖో పోటీలు ఆదివారం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. పోటీల్లో 15 జట్లు పాల్గొనగా నీల్వాయి జెడ్పీహెచ్ఎస్ జట్టు ప్రథమ బహుమతి, రేచిని జెడ్పీహెచ్ఎస్ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సాబీర్‌అలీ, మాజీ సర్పంచ్ గాలి మధు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సమ్మయ్య మాదిగ పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా బ్యాంకు లింకేజీ రుణాలు

- ఈఏడాది టార్గెట్ రూ.430 కోట్లు..
- ఇప్పటికే 60శాతం పంపిణీ..

దండేపల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు ఏటా సెర్ప్ ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తారు. సీనియారిటీ ఆధారంగా ఒక్కో సంఘానికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణం అందిస్తారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 7,982 స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.430 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకు 3,487 సంఘాలకు రూ.223 కోట్లు అందించి 60 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు.

ఏటా పెరుగుతున్న లక్ష్యం..

జిల్లాకు రుణ లక్ష్యం ఏటేటా పెంచుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.358 కోట్ల రుణ ఉండగా ఈసారి ప్రభుత్వం ఏకంగా రూ.72 కోట్లు పెంచింది. లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో కిందిస్థాయి సిబ్బంది ఉరుకులు పరుగులు తీస్తున్నారు.

లక్ష్యాన్ని దాటేశారు..

జిల్లాలోని 16 మండలాల్లో హాజీపూర్ మండలం రూ.12 కోట్లకు గాను రూ.17 కోట్లు టార్గెట్ పూర్తిచేసి లక్ష్యాన్ని దాటేశారు. బెల్లంపల్లి మండలం రూ.25 కోట్లకు రూ.18 కోట్లు, లక్సెట్టిపేట మండలం రూ.18 కోట్లకు రూ.16 కోట్లు రుణాలు అందించి లక్ష్యానికి చేరువలో ఉన్నారు.

టార్గెట్ పూర్తిచేస్తాం..

బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని మార్చిలోగా పూర్తిచేస్తాం. రుణ లక్ష్యం సాధనకు ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించాం. మూడేళ్లుగా ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకుంటున్నాం. రాష్ట్రస్థాయిలో అవార్డు తీసుకుంటున్నాం. ఈసారి కూడా లక్ష్యాన్ని అధిగమిస్తారం. రాష్ట్రస్థాయి అవార్డు తీసుకుంటాం.

– స్వర్ణలత, డీపీఎం

రైతులకు 'భరోసా' లేని పాలన


జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు


కాసిపేట : నిరసనలో దుర్గం చిన్నయ్య, నాయకులు

మంచిర్యాలటౌన్/కాసిపేట/బెల్లంపల్లి రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు భరోసా కరువైందని మంచిర్యాల, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, వానాకాలం పంట పూర్తయినా ఇవ్వలేదన్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు యాసంగి నుంచి రైతుభరోసా ఇస్తామని ప్రకటించడంపై మంచిర్యాల, కాసిపేట మండలం కొండాపూర్, బెల్లంపల్లి ఎంపీడీవో వద్ద వేర్వేరుగా ఆదివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కేసీఆర్ ఏటా రెండు పంటలకు రైతుబంధు అందించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధుకు రాంరాం పలికిందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలించేహక్కు లేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, ఏటా రైతులకు ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా, కౌలు రైతులకు రూ.12 వేల సాయం హామీలు అమలు చేయడం లేదన్నారు. ఆందోళనలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్లు పెంట రాజయ్య, ఈసంపల్లి ప్రభాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, బీఆర్ఎస్ కాసిపేట మండల అధ్యక్షుడు రమణరెడ్డి, బెల్లంపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్, నాయకులు నడిపెల్లి విజిత్ రావు, గాదె సత్యం, సుంకరి రమేశ్, తాజుద్దీన్, పడాల రవీందర్, గోగుల రవీందర్‌రెడ్డి, మంజుల రెడ్డి, పల్ల చంద్రయ్య, రాంచందర్, ఆడె బాదు, బుగ్గ రాజు, బోయిని తిరుపతి పాల్గొన్నారు.

వీరులారా.. వందనం

ఆదిలాబాద్‌టౌన్ /మంచిర్యాలక్రైం/ఖానాపూర్: శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రాణాలకు తమ ప్రాణాలను అడ్డుగా పెట్టి కాపాడేవారు రక్షక భటులు. విధి నిర్వహణలో అసాంఘిక శక్తుల దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. కర్తవ్య దీక్షలో భాగంగా చివరి వరకూ శత్రువులతో పోరాడి అమరులైనవారిని ఏటా అక్టోబర్ 21న స్మరించుకుంటున్నాం. నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విధినిర్వహణలో అమరులైన పోలీసులపై ప్రత్యేక కథనం.

- నక్సలైట్లతో పోరులో అనువులుబాసిన పోలీసులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ఘటనలు
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- నివాళులర్పించేందుకు ఏర్పాట్లు పూర్తి


ఆదిలాబాద్‌లోని పోలీసు అమరవీరుల స్తూపం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెదరని నెత్తుటి చరిత్ర, చేదుజ్ఞాపకాలు ఉన్నాయి. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకి మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒక చోట నక్సలైట్ల విధ్వంసాలు జరుగుతుండేవి. తరుచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి.. నక్సలైట్ల కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీరిని స్మరించుకోనున్నారు. అమరవీరుల స్తూపం వద్ద పోలీసులు, అమరవీరుల కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేశారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 28 ఘటనలు జరగగా, మొత్తం 48 మంది పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధి నిర్వహణలో అమరులయ్యారు. వీరిని స్మరించుకునేందుకు ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వీరి సేవలకు గుర్తుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్మృతిస్తూపం వద్ద పోలీసు ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది అమరవీరుల కుటుంబాలతో కలిసి నివాళులర్పిస్తారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన తమ సహచరుల స్మారకార్థం ఏటా అక్టోబర్ 15 నుంచి 21 వరకు జిల్లావ్యాప్తంగా పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఖానాపూర్ పరిధిలో..

దాదాపు 1983 నుంచే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ జిల్లా పరిధిలో నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో నక్సలైట్ల తూటాలకు 19 మంది పోలీసులు బలయ్యారు. ఖానాపూర్ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో నక్సలైట్లు ఈ ప్రాంతాన్ని స్థావరాలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచే తమ కార్యకలాపాలు నడిపేవారు. గుట్టలు, అడవులు ఉండటం వల్ల పోలీసులకు దొరకకుండా నక్సలైట్లు సునాయాసంగా విధ్వంసక చర్యలకు పాల్పడుతూ, గిరిజనులతో సాన్నిహిత్యం పెంచుకునేవారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అడవులు అనువుగా ఉండడంతో వారి కార్యకలాపాలు కొనసాగిస్తూ రాకపోకలు సాగించేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే నక్సలైట్లు విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు.

కొనసాగుతున్న పక్షోత్సవాలు..

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసుశాఖ ఆధ్వర్యంలో పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలతో పాటు ఔత్సాహికులకు షార్ట్‌ఫిల్మ్, ఫొటో, వీడియోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈనెల 16 నుంచి 31 వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేయనున్నారు.

సదా స్మరిస్తూ..

పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాంతాల్లో పలు కట్టడాలు నిర్మించారు.

- సీఐ చక్రపాణి జ్ఞాపకార్థం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో చక్రపాణి మెమోరియల్ హాల్ నిర్మించారు.
- 18, ఆగస్టు, 1987 అల్లంపెల్లి ఘటనకు గుర్తుగా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో అల్లంపెల్లి కాంప్లెక్స్ నిర్మించారు.
- బెల్లంపెల్లి పాతబస్తీ ఘటనలో అసువులు బాసిన హెడ్‌కానిస్టేబుళ్లు సంజీవ్‌కుమార్, శేషుల జ్ఞాపకార్థం పోలీసు వ్యాయామశాల ఏర్పాటు చేశారు.
- ఉట్నూర్ కొమ్ముగూడెం ఘటనలో మరణించిన ఎస్సై బి. కోట్యనాయక్ స్మారకార్థం చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేశారు.
- ఖానాపూర్ పోలీసుస్టేషన్‌లో ఎస్సై మల్లేశ్ జ్ఞాపకార్థం స్థూపాన్ని నిర్మించారు.

వారి త్యాగాలు వెలకట్టలేనివి



ఒకప్పుడు పోలీసులకు విధి నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. ముఖ్యంగా నక్సల్స్ కార్యకలాపాలను నిరోధించే క్రమంలో ఎందరో అమరులయ్యారు. వారి త్యాగాల వల్లే ప్రశాంత వాతావరణం ఏర్పడింది. వారి త్యాగాలు వెలకట్టలేనివి. వారి త్యాగాల స్ఫూర్తితో మేం ముందుకు సాగుతున్నాం.

– ఎం. శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

శాంతిభద్రతల కోసం అసువులు బాసారు..



శాంతిభద్రతల రక్షణ కోసం ఎందరో పోలీసులు అసువులు బాసారు. వారిని ఎల్లప్పుడు స్మరించుకుంటాం. ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఔత్సాహికులకు ఫొటో, వీడియోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేస్తాం.

– గౌస్ ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్

ఖానాపూర్‌లో అమరుల స్తూపం..


ఖానాపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల స్మారక స్తూపం

ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమవీరుల స్మారకార్థం స్తూపం లేకపోవడంతో స్టేషన్ ఆవరణలోని ఓ వేపచెట్టు కింద కొన్నేళ్లుగా శిలాఫలకంపై పేర్లు రాసి ఉంచారు. అనంతరం 2008లో అప్పటి సీఐ, ఎస్సైలు స్మారక స్తూప నిర్మాణానికి కృషి చేశారు. తదనంతరం వచ్చిన సీఐ, ఎస్సైలు, ప్రస్తుత సీఐ సైదారావుతో పాటు ఎస్సై రాహుల్ గైక్వాడ్‌లు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఘటనలు..

- జిల్లాలో 18, ఆగస్టు, 1987న కడెం మండలంలోని అల్లంపెల్లిలో జరిగిన మొదటి ఎన్‌కౌంటర్‌లో నక్సలైట్ల దాడిలో ఇద్దరు ఎస్సైలు, పది మంది కానిస్టేబుళ్లు అమరులయ్యారు.
- 12, జనవరి, 1989న చెన్నూర్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఎండీ జహిరొద్దీన్‌ను నక్సల్స్ కాల్చి చంపారు.
- 1, ఫిబ్రవరి, 1989 ఖానాపూర్ –కడెం మండలాల్లోని సింగాపూర్ అడవుల్లో పోలీసు జీపును మందుపాతరతో పేల్చివేసిన ఘటనలో ఒక ఎస్సై, ఏడుగురు పోలీసులు మరణించారు.
- 17, మే, 1991న ఉట్నూర్‌లోని కొమ్ముగూడెంలో జరిగిన ఘటనలో ఎస్సై కోట్యనాయక్, ఇద్దరు పోలీసులు మరణించారు.
- 23, జూన్, 1996న సీసీసీ నస్పూర్ కాలనీలోని ఓ ఇంట్లో నక్సలైట్లు ఉన్న సమాచారం తెలుసుకున్న శ్రీరాంపూర్ సీఐ చక్రపాణి, కానిస్టేబుల్ అశోక్‌లు అక్కడికి వెళ్లడంతో నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో వీరిద్దరు మరణించారు.
- 15, నవంబర్, 1996న సిర్పూర్(యూ) పోలీసుస్టేషన్ పేల్చివేసిన ఘటనలో ఎస్సై అహ్మద్ షరీఫ్‌తో పాటు 12 మంది పోలీసులు చనిపోయారు.
- 28, మే, 1998న బెల్లంపల్లి పాతబస్తీ దగ్గర సికాస (సింగరేణి కార్మిక సమాఖ్య) పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో హెడ్‌కానిస్టేబుళ్లు సంజీవ్‌కుమార్, శేషులు మరణించారు.
- 18, నవంబర్, 1998న మంచిర్యాల పట్టణంలోని ఏసీసీలో మదన్‌మోహన్ అనే ఏఎస్సై తన ఇంట్లో ఉండగా నక్సల్స్ కాల్చి చంపేశారు.
- 2, డిసెంబర్, 1999న ఖానాపూర్ మండలం తార్లపాడు వద్ద మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఖానాపూర్ ఎస్సై సింగం మల్లేశ్, కానిస్టేబుల్ పున్నంచంద్‌లు మరణించారు. ఈ ఘటనలో సీఐ, మరికొంత మంది పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి.


తర్లపాడ్ ఘటనలో మృతిచెందిన పోలీసులు (ఫైల్)


అల్లంపల్లి ఘటనలో...

అమరులైన పోలీసులు వీరే..


ఉర్వతే జాన్‌రావు (ఫైల్)



గోవర్ధన్ (ఫైల్)


కె.రాజేశ్వర్ (ఫైల్)


ఎం.లక్ష్మణ్ (ఫైల్)


రాథోడ్ శంకర్ (ఫైల్)


సాగిర్ అహ్మద్ (ఫైల్)


కొట్యా నాయక్ (ఫైల్)


సయ్యద్ హమీదొద్దీన్ (ఫైల్)


తాహిర్ అహ్మద్ (ఫైల్)

పి.చక్రపాణి (సీఐ), ఎస్సైలు సీహెచ్ లక్ష్మణ్‌రావు, టి.రాజన్న, బి.కోటి నాయక్, అహ్మద్ షరీఫ్, ఎస్.మల్లేశ్, సయ్యద్ ఖదీర్ ఉల్ హక్, సీహెచ్ మదన్‌మోహన్ (ఏఎస్సై), హెడ్ కానిస్టేబుళ్లు ఎం.లక్ష్మణ్, ఎంఏ గఫార్, ఎండీ జాహీరుద్దీన్, ఎంఏ జలీల్, షేక్ హైదర్, తాహెర్ మహ్మద్, ఎ.గోవర్ధన్, సయ్యద్ హమీద్ ఉద్దీన్, జానరావు, ఎ.సంజీవరెడ్డి, జి.శేషయ్య, కానిస్టేబుళ్లు ఎస్ఎస్.చారి, అశోక్‌రావు, కె.జగన్నాథ్‌రావ్. విఠల్ సింగ్, జె.ముకుంద్‌రావ్, పి.రఘునాథ్, ఎంఏ జావిద్, జి.బాపురావ్, వేణుగోపాల్, భోజరాం, మోహన్‌దాస్, గణపతి, సాగిర్ అహ్మద్, కె.అశోక్, జె.సతీష్‌బాబు, మంగిలాల్, సి.రామరావు, అంకమ్‌రావు, ఆర్.కబీర్‌దాస్, ఎం.గోవింద్‌రా వ్, ఆర్.శంకర్, ఆర్.ఓంకార్, కె. సుభాష్, శివశంకర్, కె. రాజేశ్వర్, పూనమ్‌చంద్, ఆర్.నర్సయ్య, ఎ.బీంరావ్


నివాళులర్పిస్తున్న పోలీసులు (ఫైల్)

కారు, బస్సు ఢీ

ముధోల్: మండలంలోని విఠోలి గ్రామ సమీపంలో ఆదివారం కారు, బస్సు ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. ఏఎస్సై సాహెబ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. విఠోలి గ్రామ సమీపంలో కారు, బస్సు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణం నష్టం జరుగలేదు. కారు డ్రైవరు నగేశ్ అజాగ్రత్తత వల్లే ప్రమాదం జరిగినట్లు ఏఎస్సై తెలిపారు. కాగా బస్సు డ్రైవర్ లక్ష్మణ్‌పై విఠోలి గ్రామానికి చెందిన సాయిలు, జీవన్‌లు దాడి చేయగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నర్సింహస్వామి ఆలయంలో చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహనగర్‌లోగల నర్సింహస్వామి ఆలయంలో ఆదివారం వేకువజామున చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గుర్తు తెలియని దుండగుడు ఆలయంలోకి ప్రవేశించి, గర్భగుడి తాళం పగులగొట్టాడు. స్వామివారి వెండి మకర తోరణంతోపాటు, వెండి కిరీటం, హుండీ పగులగొట్టి నగదు అపహరించాడు. ఉదయం 9 గంటలకు పూజారి ఆలయానికి చేరుకోగా, తాళం పగులగొట్టి ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేశాడు. వారు పోలీసులకు సమాచారమివ్వగా, ఏఎస్పీ అవినాష్ కుమార్, పట్టణ సీఐ గోపినాథ్ ఆలయానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారంగా ఆధారాలు సేకరిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి


మల్లన్న (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని బామ్ని కే గ్రామానికి చెందిన బర్దిపూరం మల్లన్న (58) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు శనివారం బావిలో పడి మృతిచెందాడు. లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్దిపూరం మల్లన్న శనివారం రాత్రి పశువులను తీసుకురావడానికి గ్రామశివారులోకి వెళ్లాడు. గ్రామంలోని బావి గోడపై కూర్చొని పశువుల కోసం చూస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి నీట మునిగి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రత్న, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి కుర్మపల్లి ఫ్లైఓవర్‌పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆర్కే 7లో జనరల్ మజ్దూర్‌గా పని చేసే నాగుల సంతోష్ (24) ఆదివారం మృతిచెందాడు. ఆర్కేపీ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి పట్టణానికి చెందిన సంతోష్ విధి నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. జాతీయరహదారిపై వెళ్తుండగా ఫ్లైఓవర్‌పై ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో సంతోష్ తలకు తీవ్ర గాయమైంది. వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సంతోష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వాహనంపై వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణపాయం నుంచి తప్పించుకునే వాడని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బేస్‌క్యాంపు వాచర్‌పై తేనెటీగల దాడి


చికిత్స పొందుతున్న వెంకటి

వేమనపల్లి: మండల కేంద్రానికి చెందిన అటవీ బేస్‌క్యాంపు వాచర్ పోతుగంటి వెంకటిపై తేనెటీగలు దాడి చేయగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఉదయం మేక పిల్లలకు మేత తెచ్చేందుకు గ్రామ సమీపంలోని మత్తడి ఒర్రెవైపు వెళ్లాడు. చెట్టుకు అల్లుకొని ఉన్న ఏద ఆకు తీగలను లాగుతుండగా చెట్టుపై ఉన్న తేనేటీగలు వెంకటిపై దాడి చేశాయి. వాటి ధాటికి తట్టుకోలేక పత్తి చేనులోని పైరులోకి వెళ్లి దాక్కున్నాడు. అక్కడి నుంచి అతికష్టం మీద ఇంటికి వచ్చి ఆర్ఎంపీ వైద్యుడి వద్ద వైద్యం చేయించుకున్నాడు. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో వెంటనే చికిత్స కోసం చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం


చెరువులో ప్రశాంత్ మృతదేహం

నిర్మల్: జిల్లాలోని బాసర మండలంలోని రేణుకపూర్ చెరువులో ఆదివారం గ్రామానికి చెందిన ప్రశాంత్ మృతదేహం లభ్యమైంది. అటుగా వెళ్తున్న స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్సై గణేశ్ చేరుకుని మృతదేహాన్ని గజఈతగాళ్ల సహాయంతో వెలికి తీయించారు. ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లిన ప్రశాంత్ తామర పువ్వులు కోసందుకు రేణుకాపూర్ చెరువులోకి దిగాడు. ప్రమాదవశాత్తు తామర పువ్వుల తీగలకు చుట్టుకొని మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


108లో ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట లిక్కర్ గోదాం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్సెట్టిపేటకు చెందిన గోపతి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. లక్సెట్టిపేటకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న గోపతి శ్రీనివాస్‌ను వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో గోపతి శ్రీనివాస్ రెండు కాళ్లు విరిగాయి. సమాచారం అందుకున్న ఎస్సై గోపతి సురేశ్ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు కరీంనగర్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు మహారాష్ట్రకు చెందినదిగా గుర్తించారు.

డిపోలో బస్సులు.. బస్టాండ్‌లో రద్దీ

ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. నిర్మల్ డిపోలో ఆర్టీసీకి సంబంధించిన 147 బస్సుల్లో 72 ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. ప్రభుత్వానికి చెందిన పల్లెవెలుగు బస్సులు మరమ్మతులకు నోచుకోక డిపోలోనే ఉండిపోతున్నాయి. దీంతో అధికారులు ప్రైవేట్ బస్సుల్లోనే ప్రయాణికులను తరలిస్తున్నారు. తక్కువ సంఖ్యలో బస్సులు నడుస్తుండడంతో ప్రయాణికులు ప్రమాదకరంగా ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేస్తున్నారు. డిపోలో ఉన్న బస్సులకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


మరమ్మతులకు నోచుకోక డిపోకే పరిమితమైన పల్లెవెలుగు బస్సులు


బస్సులో కిక్కిరిసి ఉన్న ప్రయాణికులు


బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు